క్లుప్తంగా

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి



దుకాణదారులను కలిసిన కమిషనర్

నరసాపురం: మునిస్పాలిటీ లోని వ్యాపారులు ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలకు వెళ్లి సర్వే ఉద్దేశాన్ని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నరసాపురం మున్సిపాలిటీలో దుకాణాల ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టామని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు షాపుల యజమానులు ఆధార్, పాన్‌కార్డు, జీఎస్టీ నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ చూపించి సహకరించాలన్నారు. కమిషనర్ వెంట ఆర్‌ఐ ఎ.నానాజీ, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

భూసారం పెంచుకోవాలి



ప్రకృతి వ్యవసాయ విభాగం అవగాహన సదస్సు

పెనుగొండ: రైతులు దాళ్వా పంట అనంతరం వారి చేలల్లో పచ్చిరొట్ట పెంచడం ద్వారా భూసారం పెంచుకోవచ్చని ప్రకృతి విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు వై.నూకరాజు సూచించారు. మంగళవారం పెనుగొండ వ్యవసాయ శాఖ, మండల మహిళా సమాఖ్య, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రిల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నవ ధాన్యాలు, పచ్చిరొట్ట వేయడానికి రైతులను ఒప్పించి భూసారం పెంచడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన, ఏపీఎం పుష్పలత, జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, జ్యోతి వీరాస్వామి బి.ఆదినారాయణ, కె.ప్రేమలత పాల్గొన్నారు.

లైన్‌మేన్ మోహన్‌రావుకు సన్మానం



లైన్‌మేన్ మోహన్ రావును సన్మానిస్తున్న దృశ్యం

పోడూరు: స్థానిక ఎలక్ట్రికల్ లైన్‌మేన్ కాసా మోహన్‌రావు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లైన్‌మెన్ దివస్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు భీమవరం సర్కిల్ ఆఫీసులో ఎస్ఈ ఆలపాటి రఘునాథ్ బాబు, విద్యుత్ అధికారులు అవార్డును అందజేసి మంగళవారం ఘనంగా సన్మానించారు. మోహన్‌రావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ కె.మధు కుమార్, డీఈ సీహెచ్ రామకృష్ణ, పోడూరు ఏఈ వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు



కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

నరసాపురం రూరల్: కొప్పర్రు గ్రామంలోని పంట కాలువ రోడ్డులో కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారింది. పెదపత్ర బోది సమీపంలో నీటి ప్రవాహ వేగానికి కల్వర్టు కోతకు గురయ్యింది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు వద్ద ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కాలువలోకి పడుతున్నాయి. ఈ ప్రాంతంలో రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని గ్రామానికి చెందిన చినిమిల్లి వీరబాబు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఏఎంసీ ప్రహరీ

- డ్రెయినేజీలో పారని మురుగు
- దోమల స్వైరవిహారంతో స్థానికుల అగచాట్లు
- స్పందించని ఏఎంసీ అధికారులు



డ్రెయినేజీ వైపు ఒరిగిపోయిన ప్రహరీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని మార్కెటింగ్ యార్డు ప్రహరీ డ్రెయినేజీ వైపుకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రహరీని ఆనుకుని ఉన్న డ్రెయినేజీ దగ్గరకు నొక్కుకుపోయి మురుగునీరు ముందుకు పారడంలేదు. ఫలితంగా సుమారు 200 మీటర్లు మేర డ్రెయినేజీ అధ్వానంగా తయారైంది. దోమలు విజృంభించి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డు గొడౌన్ సముదాయాల పరిధిలో తూర్పు వైపు పాత ప్రహరీపై రెండు అడుగులు ఎత్తు పెంచి సుమారు ఎనిమిదేళ్ల క్రితం గోడ కట్టారు. ఈ ప్రహరీ గతంలో కురిసిన భారీ వర్షాలకు కొంతమేర డ్రెయినేజీలో పడిపోయింది. మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారింది. వర్షాకాలంలో మురుగునీరు మార్కెట్ యార్డు కార్యాలయం, గొడౌన్ సముదాయాల మధ్యలో ఉన్న మునిసిపల్ రోడ్డుపై చేరుతుంది. ఈ నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రహరీ పడిపోయిన ప్రాంతంలో డ్రెయినేజీని శుభ్రం చేయించారు. మిగిలిన ప్రాంతంలో ప్రహరీ బీటలు తీసి వాలిపోయింది. పారిశుద్ధ్య కార్మికులు గోడకు కర్రలు అడ్డుపెట్టి పనులు కొనసాగిద్దామన్నా వీలుగా లేదు. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలుపుదల చేశారు. ప్రహరీ సమస్యపై ఏఎంసీ అధికారుల స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ప్రహరీని తొలగించి మురుగునీరు పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దుర్వాసన



డ్రెయినేజీ సమస్యపై గత కొంత కాలంగా మునిసిపల్ అధికారులకు ఎన్నో ఫిర్యాదులు చేశాం. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై మురుగునీరు చేరి, దుర్వాసన వెదజల్లుతుంది. వేసవిలో ఆరుబయట కూర్చోవాలంటే దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. గోడ ప్రమాదకరంగా ఉండడంతో పనులు చేయడానికి భయపడుతున్నారు.

– కాకుల మాచిరాజు, స్థానికుడు

గోడను తొలగించాలి



ప్రమాదకరంగా ఉన్న గోడను తొలగిస్తే శానిటరీ సిబ్బంది పనులు చేసుకోవడానికి వీలవుతుంది. మురుగు నీరు ఖాళీ స్థలంలోకి రావడం, వాటిలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ నిల్వ ఉండి దుర్వాసన వస్తుంది. మునిసిపల్ అధికారులు పనులు చేయడానికి ముందుకొచ్చినా, మార్కెటింగ్ యార్డు అధికారుల్లో చలనం లేదు. వారు స్పందించకుంటే మార్కెటింగ్ యార్డును ముట్టడిస్తాం.

– కుంపట్ల లక్ష్మణ గోవింద్ (చినరాజా), స్థానికుడు

త్వరలో శుభ్రం చేయిస్తాం



కూలిపోయిన గోడ గోడ శిథిలాలను డ్రెయినేజీలో నుంచి తొలగించాం. గోడ ఒరిగిపోయి ఉండడంతో కింద డ్రెయినేజీ కూడా సన్నగా నొక్కుకుపోయింది. తద్వారా మురుగునీరు ముందుకు పారడంలేదు. గోడకు కర్రలు బోటుపెట్టి తొలగిందామన్నా వీలుకాలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చింది. త్వరలో డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం.

– బి.విజయసారధి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

కందిపప్పుకు మంగళం!



మేడపాడులో రేషన్ సరుకులు ఇస్తున్న ఎండీయూ వాహనం

యలమంచిలి: ప్రజా పంపిణీ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. రేషన్ పంపిణీ కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం, పంచదారకే పరిమితం చేసింది. రెండు నెలలుగా లబ్ధిదారులకు కందిపప్పు అందడంలేదు. యలమంచిలి మండలంలోని మొత్తం 53 రేషన్ షాపులు ఉన్నాయి. 23,060 లబ్ధిదారులు ఉన్నారు. రేషన్ సరుకుల్లో కిలో రూ.67కు సరఫరా చేసే కందిపప్పు ఇవ్వకపోవడంతో మార్కెట్లో కందిపప్పు కిలో రకాన్ని బట్టి రూ.120 నుంచి రూ.140కు కొనాల్సి వస్తోందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. కందిపప్పు ఇవ్వక పోవడం దుర్మార్గమని పేదలు వాపోతున్నారు. ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయటం లేదని సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిత్యావసర సరుకులు అన్నీ ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

‘ఉచిత బస్సు ప్రయాణం హామీ ఊసే లేదు’



ముదునూరికి అంబేద్కర్ ప్రతిమ అందిస్తున్న శ్యామల

నరసాపురం: మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆరోపించారు. పార్టీ నరసాపురం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన 30వ వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామలాశరత్ ముదునూరిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు అంబేద్కర్ ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారికి మళ్లీ తమనుతాము నిరూపించుకునే సమయం వచ్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే ఎత్తడంలేదని అన్నారు. డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వార్డులు, గ్రామాల్లో పర్యటించి మహిళల సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పలువురు పార్టీ నేతలు, 30వ వార్డు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు

నరసాపురం: ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు కోరారు. మంగళవారం స్థానిక 3వ వార్డు సీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లు ఆందోళన చేసి, సమస్యలపై వైద్యాధికారి మోహన లక్ష్మీప్రస్నకు వినతిపత్రం అందజేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రూ.6 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, నాణ్యమైన ఫోన్‌లు, యూనిఫామ్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఎస్ లక్ష్మి, ఎస్ అమరావతి, కె.కమల, ఎం సువర్ణ, డి.రాజేశ్వరి, బి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

పెనుగొండ: ఆశ వర్కర్లుకు కనీస వేతనం, ఒప్పంద జీఓలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు మంగళవారం సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి ఆశ వర్కర్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సమస్యలపై మార్చి 6న జరిగే రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయాలని వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కంకిపాటి లక్ష్మీ కుమారి, మామిడిశెట్టి వెంకటలక్ష్మి, దొమ్మేటి దుర్గ, తప్పెట్ల గౌరమ్మ, వెన్నపు రాజేశ్వరి పాల్గొన్నారు.

వీధి పశువులకు టీకాలు



వీధి పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ డాక్టర్ మల్లేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: రోడ్లపై తిరిగే పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నామని సహాయ సంచాలకులు ప్రాంతీయ పశు వైద్య శాల, పాలకొల్లు డాక్టర్ మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వీధుల్లో తిరుగుతున్న పశువులకు టీకాలు వేశారు. వీధి పశువుల కోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటుచేశామని, ఇది మార్చి 31 వరకు కొనసాగుతుందని డాక్టర్ మల్లేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 76 వీధి పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీసీఏ మెంబర్ మణికంఠ, నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు మనీష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

8న ఉచిత వైద్య శిబిరం

ఉండి: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు (హెడ్) ఆధ్వర్యంలో ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన ఇంటి వద్ద గల ఖాళీ స్థలంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం స్థానిక ఆర్ఎంపీ వైద్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం ప్రాంతానికి చెందిన మిత్ర మెడికేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ కర్రా, డాక్టర్ వర్ధన్ కాకులపాటి బీపీ, షుగర్, జనరల్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

అన్ని రంగాల్లోనూ ముందుండాలి



పాలకొల్లు సెంట్రల్: యోగ సాధన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఆశ డే కార్యక్రమంలో యోగ నిర్వహించారు. డాక్టర్ ఎం నవ్య, జీవన్ ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సత్యవేణి, ఎన్ మంగ, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

యోగపై అవగాహన

యలమంచిలి: తేలికపాటి శారీరిక శ్రమ, యోగ సనాలు సాధన చేయడం ద్వారా గర్భిణులకు సుఖ ప్రసవానికి అవకాశం ఉంటుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి సతీష్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యలమంచిలి, మేడపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద గర్భిణులకు యోగ ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా మాట్లాడుతూ యోగను జీవితంలో ఒక భాగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నరసాపురం రూరల్: మహిళలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే ఆరోగ్యమైన కుటుంబంగా విరాజిల్లుతుందని సీడీపీఓ బి.ఊర్మిళ అన్నారు. మంగళవారం ఎల్బీచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, మొగల్తూరు మండలం ముత్యాలపల్లి చింతరేవు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు బొద్దు విజయలక్ష్మి, శ్రీదేవి, అంగన్‌వాడీలు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన



కర్రి గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను విస్మరించి తన తనయుడు, మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాజకీయ పార్టీలు, ప్రజలకు మధ్య చిచ్చుపెడుతున్నారని జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ‘వైఎస్సార్ సీపీ నాయకులకు పనులు చేస్తే.. పాములకు పాలు పోసినట్లే’ అన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను ఆమె ఖండించారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారికి కండువాలు కప్పి సీఎం తన పార్టీలోకి ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇదే తరహా విధానాలు రాబోవు కాలంలో సీఎంలు కూడా అనుసరిస్తే ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసిన సీఎం చంద్రబాబు ప్రజలను విభజించి పాలిస్తున్నారంటూ మండిపడ్డారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సూపర్ సిక్స్‌లో ఉచిత బస్సు ప్రయాణం హామీపై ఇప్పటికీ స్పందించకపోవడం మహిళలను మోసం చేయమేనని వివరించారు. రాబోవు కాలంలో మహిళలే కూటమి సర్కార్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భీమవరం డీఈ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథ కాలు అమలు చేయాలని గ్రాడ్యుటీ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్‌చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్, ఐసీడీఎస్ పీడీలకు అందజేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలనే జీవోలను వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈ నెల పదో తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓ పక్క ధరలు పెరిగి విపరీతమైనటువంటి ఇబ్బందులకు గురవుతుంటే రెండో పక్క పని భారంతో చాలా సతమతమయ్యే పరిస్థితి కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు ఒక పైసా కూడా జీతాలు పెరగలేదని ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి ఉద్యమించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారని, వాడితే కఠిన చర్యలు తప్పవని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాఘవ అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ఉద్యమించాలన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 రోజులుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, గుడ్డ సంచులనే వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలతో పాటు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ లక్ష్మి తులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ ధాన్యాలు సాగు చేయండి



ప్రకృతి సాగుపై మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

ఆకివీడు: రైతులు రబీ సాగు మాసూళ్లు పూర్తయిన తరువాత నవ ధాన్యాలను సాగు చేయాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగుతో భూమిలో సారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గుతుందన్నారు. వరి చేల గట్లపై కూరగాలయ విత్తనాలను సాగు చేయాలని సూచించారు. వర్మీ కంపోస్టును మహిళలు తమ ఇంటి వద్దే ఉత్పత్తి చేయొచ్చని వివరించారు. కిచెన్ గార్డెన్లలో వర్మీ కంపోస్టు ఉపయోగించి, మంచి కూరగాయలను సాగు చేయాలన్నారు. రైతులకు, మహిళలకు ప్రకృతి సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏట ప్రియాంక, మహిళలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుకు రెండు రోజులే గడువు

యలమంచిలి: వరి రైతులంతా ఈ నెల ఆరో తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ రబి సీజన్‌కు మండలంలో 5517 ఎకరాల్లో వరి సాగవ్వగా, ఇంతవరకు 5450 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. 93 శాతంతో 5050 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. సొంత భూమి ఉన్న రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవాలని ఆమె కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

వీరవాసరం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులైన తోటరాంపండు, గన్నమణి అమ్ములు కుటుంబ సభ్యులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యవసర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గెద్దం భారతి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా గోడ పత్రికలు, హోర్డింగులు, ప్రకటనలు చేయకుండా స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయమని అడిగిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులని తెలిపారు.